వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 201 శనివారం | 10 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# ఐక్యతా మహా సభలను విజయవంతం చేయాలి




పాల్గొననున్న మూడు విప్లవ పార్టీలు

సీపీఐఎంఎల్ మాస్ లైన్ రెవల్యూషనరీ ఇనిషియేటివ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం



# గ్యారెంటీలకే.. పెద్దపీట

అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి

- హాజరుకాని ప్రతిపక్ష నేత కేసీఆర్
- రాష్ట్ర బడ్జెట్ రూ.2,75,891 కోట్లు
- ఆరు గ్యారెంటీలకు రూ.53,196 కోట్లు
- నిరుద్యోగులకు భరోసా
- త్వరలో నూతన విత్తన విధానం
- కౌలు రైతులకూ రైతు భరోసా
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు






వివరాలు 2లో..

2024-25 రాష్ట్ర ఆర్థిక సంవత్సరానికి రూ.2,75,891 కోట్ల అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.2,01,178 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.29,669 కోట్ల మూలధన వ్యయంతో కొత్త ప్రభుత్వ తొలి పద్దును ప్రతిపాదించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలకు రూ.53,196 కోట్లు కేటాయించారు. అదే విధంగా నిరుద్యోగులకు భరోసా ఇవ్వడంతోపాటు త్వరలోనే నూతన విత్తన విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు ప్రకటించారు. గత ప్రభుత్వాలు కౌలు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి నిరర్థకమైన ఆస్తులు పెంచి తెలంగాణ ప్రజలకు భారం మోపడం తమ విధానం కాదన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందడం, వారు సంతోషంగా ఉండటం మాత్రమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. అయితే బడ్జెట్ సమావేశానికి కూడా ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాశంగా మారింది. - వరంగల్ వాయిస్, వరంగల్




# బీజేపీ పిలుస్తోంది రండి..

- పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేయాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలి
- వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్




# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా
- శానిటేషన్ ఉన్నతాధికారులతో సమావేశం



# పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయండి

కలెక్టర్ ప్రావీణ్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో గృహ జ్యోతి పథకంలో గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల అసంపూర్తి వివరాలను ప్రజలనుంచి త్వరగా సేకరించి వేగవంతంగా యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం నగరంలోని 33వ డివిజన్ శాంతినగర్‌లోని మహాత్మా గాంధీ కమ్యూనిటీహాల్, 34వ డివిజన్ శివనగర్‌లోని కార్మిక సంఘ భవనంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్పీలు, మెప్మా సిబ్బంది, అంగన్వాడీ, ఐకేపీలకు తగు సూచనలిచ్చారు. - వరంగల్ వాయిస్, వరంగల్




# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- స్కూల్ బస్ ఢీకొనడంతో మృతి
- అతివేగమే ప్రమాదానికి కారణంగా గుర్తింపు

శనివారం 10, ఫిబ్రవరి 2024
www.warangalvoice.net

# గ్యారెంటీలకే.. పెద్దపీట



**అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి**

**హాజరుకాని ప్రతిపక్ష నేత కేసీఆర్**

**రాష్ట్ర బడ్జెట్ రూ.2,75,891 కోట్లు**

**ఆరు గ్యారెంటీలకు రూ.53,196 కోట్లు**

**నిరుద్యోగులకు భరోసా**

**త్వరలో నూతన విత్తన విధానం**

**కౌలు రైతులకూ రైతు భరోసా**

**నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత ప్రభుత్వ పథకాలు గొప్ప.. అమలు దిబ్బ అన్నట్లుగా ఉండేవని రాష్ట్ర అర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే మూడు అత్యంత ప్రధానమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధిస్తామన్నారు. గత పాలకులు ప్రభుత్వ ఖజానాను దివాలా తీయించారని, ప్రణాళిక లేకుండా, హేతుబద్దత లేకుండా వారు చేసిన అప్పులు ఇప్పుడు పెద్ద సవాళ్లుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రణాళికాబద్ధమైన ఆలోచనలతో, సహేతుకమైన కార్యచరణతో ఈ సవాళ్లను అధిగమిస్తామన్నారు. దుబారా వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి నిరర్థకమైన ఆస్తులు పెంచుకుంటూ వాటిని తెలంగాణ ప్రజలకు భారంగా చేయడం మా విధానం కాదన్నారు. కేవలం తెలంగాణ ప్రజలు అభివృద్ధి చెందడం, వారు సంతోషంగా ఉండటం మాత్రమే మా లక్ష్యం అన్నారు. దీనికి అనుగుణంగానే తమ ప్రభుత్వ విధానాలు ఉండేలా బడ్జెట్ లో ప్రతిపాదనలు చేశామన్నారు. గత పాలకుల నిర్వాకంతో ధనిక రాష్ట్రం ఆర్థిక కష్టాల పాల్కెందని చెప్పారు. గత ప్రభుత్వ అప్పులను అధిగమించి అభివృద్ధిలో సంతులిత వృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని వెల్లడించారు.

## అర్హులకు రైతు భరోసా....

రైతుల రుణమాఫీపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా ఆయన రైతు రుణమాఫీపై గుడ్ న్యూస్ చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని.. దీనికి సంబంధించి విధి విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంటకు మద్దతు ధర కూడా అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కౌలు రైతులకు కూడా రైతు భరోసా సాయాన్ని ఇచ్చేందుకు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతుబంధు నిబంధనలు పునఃసవిరీక్షించి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద రూ.15 వేలు అందిస్తామన్నారు. అలాగే, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఆధారంగా రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని కౌలు రైతులకూ వర్తింప చేసేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని చెప్పారు. నాసిరకం విత్తనాలు అరికట్టేలా, నాణ్యమైన విత్తన ఉత్పత్తి జరిగేలా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. త్వరలోనే ఓ నూతన విత్తన విధానం తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు.

## అర్హులందరికీ గృహ జ్యోతి..

రాష్ట్రంలో అర్హులైన కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఉచితంగా అందించబోతున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికే మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నామని, ఈ పథకం అమలుకు బడ్జెట్‌లో రూ.2,418 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలోని ట్రాన్స్ కో, డిస్కమ్ లకు రూ.16,825 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. 'ప్రజావాణి'లో రెండు నెలల్లో వచ్చిన దరఖాస్తులు 43,054 కాగా, ఇళ్ల కోసం వచ్చినవి 14,951అని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన కోసం కలెక్టర్లు, శాఖాధిపతులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామన్నారు.

## మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం..

ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా ఇక నుంచి నంది అవార్డును గద్దర్ అవార్ పేరుతో చిత్ర, టీవీ కళాకారులకు అందచేయనున్నామన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కు ఇదే తాము ఇచ్చే నివేళి అన్నారు. గద్దర్ను గౌరవించడం అంటే తెలంగాణ సంసృతిని, ప్రగతిల భావజాలంతో సమాజాన్ని చైతన్య పరిచే ప్రజా కవులు, ప్రజా గాయకులను గౌరవించడమే అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడం మా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అన్నారు భట్టి. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు నిరాటకంగా అందించే అవకాశం ఉంటుందన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు వినియోగం ఎక్కువైందని, ఎంతో మంది యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏ మాత్రం ఉపేక్షించే అంశం కాదన్నారు. అందుకే రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. రాష్ట్రంలో గత నెలరోజులుగా మన పోలీసులు, ఆబ్కారీ అధికారులు దాడుల్లో పెద్ద మొత్తంలో పట్టుకున్న గంజాయి ఇతర మాదక ద్రవ్యాలే మా కార్యచరణకు నిదర్శనం అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక బృందాలకు అవసరమైన నిధులను సిబ్బందిని కేటాయించాం. తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం అనే మాట ఉత్పన్నం కాకూడదన్నారు. ప్రజల్లో అవగాహన పెంచి మాదక ద్రవ్యాల మహమ్మారి బారిన పడకుండా తెలంగాణ యువతను కాపాడుతున్నామన్నారు. ఈ నెల 4 వ తేదీన జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో హుక్కా బార్లను కూడా నిషేదించామన్నారు.

## హైకోర్టుకు వంద ఎకరాలు..

ఎంతో కాలంగాణ పెండింగ్‌లో ఉన్న నూతన హైకోర్టు భవన సముదాయానికి వంద ఎకరాల స్థలాన్ని కేటాయించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. న్యాయవ్యవస్థ పటిష్ఠతకు మేం తీసుకుంటున్న చర్యతో దేశ మొత్తం తెలంగాణ వైపు చూస్తుందనడంలో సందేహం లేదన్నారు. కేంద్రం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టినందునే ఇక్కడకూడా అదే బడ్జెట్ పెట్టాల్సి వచ్చిందని ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలకు విడుదల చేసే నిధులు సాధ్యమైనంత ఎక్కువగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలనే స్పష్టత ఉందన్నారు. అలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం పూర్థి స్థాయి బడ్జెట్ లో వివిధ రంగాలవారిగా కేటాయింపులు జరిగినప్పుడే, మన రాష్ట్రానికి ఎంత మేరకు ఆ నిధుల్లో వాటా వస్తుందనేది అంచనా వేయగలుగుతామన్నారు. అందువల్లే కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టినప్పుడే రాష్ట్రంలో పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టాలని నిర్ణయించామన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ ప్రవేశ పెడతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర మొత్తం సమగ్రంగా అభివద్ధి చేయడమే లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రస్తావించిన విధంగా ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్రంలోని బడుగు బలహీనులను అభివృద్ధి చేస్తామన్నారు.

## నిరుద్యోగులకు భరోసా..

బడ్జెట్‌లో నిరుద్యోగులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలను నిర్వహించే టీఎస్‌పీఎస్సీకి బ్జడెట్‌లో రూ.40 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. యువకులను రెచ్చగొట్టడం కాదు. అక్కున చేర్చుకుంటాం. వారికి ఆసరాగా ఉంటాం.. ఆదుకుంటాం అన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. త్వరలోనే మెగా డీఎస్సీ ఉంటుందని స్పష్టత ఇచ్చారు. త్వరలో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ చేసి, నియామక పత్రాలు అందిస్తామన్నారు. గ్రూప్-1లో 64 ఉద్యోగాలని చేర్చి భర్తీ చేయబోతున్నామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ గ్రూప్ -1 ఉద్యోగాలను ఇవ్వలేదని దుయ్యబట్టారు.

## నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు

ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకుగాను బడ్జెట్ లో రూ. 7,740 కోట్లు కేటాయించామన్నారు. గత సర్కార్ పేదలకు డబుల్ బెడ్ రూంలని మోసం చేసిందని.. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టామని తెలిపారు. ఇళ్లు లేనివారికి ఇండ్లు, స్థలం ఉంటే.. నిర్మాణానికి రూ. 5 లక్షల సాయం చేస్తామన్నారు. ఆ నిధులను కేంద్రం నుంచి తీసుకొచ్చి ఇవ్వబోతున్నామన్నారు. పరిశ్రమల శాఖకు రూ.2,543 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ. 40,080 కోట్లు కేటాయించామన్నారు. ఉపాధి కల్పన జోన్ గా మూసీ పరివాహక ప్రాంతం ఉందని చెప్పారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల కోసం రూ. 500 కోట్లు, యూనివర్సిటీల్లో సదుపాయాల కోసం రూ. 500 కోట్లు కేటాయిస్తామన్నారు.

## కేసీఆర్ వస్తున్నారంటూ హడావిడి..

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. విపక్ష నాయకుని హోదాలో తొలిసారిగా శనివారం అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారని బీఆర్ఎస్ వర్గాలు ప్రచారం చేశాయి. కానీ బడ్జెట్ ప్రసంగానికి కూడా ఆయన దూరంగా ఉన్నారు. బడ్జెట్ ప్రసంగం తర్వాత అసెంబ్లీ, శాసన మండలి వాయిదా పడ్డాయి. సోమవారం కీలకమైన నీటి ప్రాజెక్టుల అంశంపై చర్చ జరగనుంది. ఆ రోజున కేసీఆర్ సభకు హాజరవుతారా లేదా అన్నది స్పష్టత లేదు. పదమూడో తేదీన నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారని బీఆర్ఎస్ రాష్ట్రంపై పోరాటం ప్రారంభించింది. రేవంత్ రెడ్డి తాము ఎలాంటి ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించలేదని..బీఆర్ఎస్ హయాంలోనే కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారని చెబుతున్నారు. బీఆర్ఎస్ రాజకీయ పోరాటానికి కౌంటర్ గా.. మేడిగడ్డ వద్దకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకెళ్లి .. ప్రాజెక్టులో అవినీతి, బ్యారేజీ కుంగిపోవడం వంటి అంశాలను వివరించాలని అనుకుంటున్నారు.

## ఆరు గ్యారెంటీలకు తొలి ప్రాధాన్యం..

ఆరు గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీకి నెలకు రూ.300 కోట్లు చెల్లిస్తున్నాం అన్నారు. ఆరోగ్యశ్రీకి అవసరమైన నిధులు అందిస్తాం అన్నారు. గృహజ్యోతి ద్వారా అర్హులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, త్వరలో రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం అన్నారు. సీఎం దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. పీఎం మిత్ర నిధులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రెండు లెదర్ పార్కులు, రాష్ట్రం నలుమూలలా ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం అన్నారు. డ్రై పోర్టులను అందుబాటులోకి తెచ్చేందుకు బృహత్ ప్రణాళిక అమలు చేస్తామని ప్రకటించారు. గ్రావిరీణ ప్రాంతాల అభివృద్ధికి కృత్రిమ మేధ ఉపయోగిస్తాం. ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధికి నూతన పాలసీ తీసుకుని వస్తాం. ఐటీ రంగాన్ని రాష్ట్రం నలుమూలలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఐటీ విస్తరణకు అమెరికాలోని ఐటీ సర్వ్ సంస్థతో సంప్రదింపులు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలోనే అత్యంత పటిష్ఠమైన ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామన్నారు.

## వివిధ రంగాలకు బడ్జెట్ కేటాయింపులు ఇలా ఉన్నాయి..

- ఆరు గ్యారెంటీలకు రూ.53,196 కోట్లు అంచనా.
- పరిశ్రమల శాఖ రూ.2,543 కోట్లు.
- ఐటి శాఖకు రూ.774కోట్లు.
- పంచాయతీ రాజ్ రూ.40,080 కోట్లు.
- పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు.
- మూసీ రివర్ ఫ్రాంట్ కు వెయ్యి కోట్లు.
- వ్యవసాయ శాఖ రూ.19,746 కోట్లు.
- ఎస్సీ, ఎస్టీ గురుకుల భవన నిర్మాణాలకు రూ.1,250 కోట్లు.
- ఎస్సీ సంక్షేమం రూ.21,874 కోట్లు.
- ఎస్టీ సంక్షేమం రూ.13,013 కోట్లు.
- మైనార్టీ సంక్షేమం రూ.2,262 కోట్లు.
- బీసీ సంక్షేమం, బీసీ గురుకుల భవనాల నిర్మాణంకు రూ.1,546 కోట్లు.
- బీసీ సంక్షేమం రూ.8 వేల కోట్లు.
- విద్యా రంగానికి రూ.21,389 కోట్లు.
- తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ.500 కోట్లు.
- యూనివర్సిటీల్లో సదుపాయాలకు రూ.500 కోట్లు.
- వైద్య రంగానికి రూ.11,500 కోట్లు.
- విద్యుత్ - గృహ జ్యోతికి రూ.2,418 కోట్లు.
- విద్యుత్ సంస్థలకు రూ.16,825 కోట్లు.
- గృహ నిర్మాణానికి రూ.7,740 కోట్లు.
- నీటి పారుదల శాఖకు రూ.28,024 కోట్లు.

## మామునూర్ పీటీసీలో డ్రిల్ నర్సరీ ప్రారంభించిన సీపీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మామునూర్ పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన డ్రిల్ నర్సరీ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం ప్రారంభించారు. పోలీస్ శిక్షణ సమయంలో పోలీస్ సిబ్బందికి పోలీస్ డ్రిల్ పై మరింత పట్టు సాధించే రీతిలో పరేడ్ మైదానం ప్రాంగణంలో నూతనంగా డ్రిల్ నర్సరీ ని నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ నర్సరీలో డ్రిల్ శిక్షణ అందించే తీరును అధికారులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో పీటీసీ ప్రిన్సిపాల్ పూజా ఇంజారపు, క్రైం డీసీపీ దాసరి మురళీధర్ తో పాటు ఏసీపీలు, పీటీసీ డీఎస్పీ, ఆర్ఐలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఎస్ఐ, ఎస్ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ 'గావ్ చలో అభియాన్'



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 'గావ్ చలో అభియాన్' (పల్లెకు పోదాం పదండి) కార్యక్రమంలో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం డివిజన్ 37, గిరి ప్రసాద్ నగర్, ఎంఎం నగర్, బుడగ జంగాల కాలనీ బూత్ 213, 214లో వివిధ వర్గాల ప్రజలతో, పార్టీ బూత్ కమిటీ సభ్యులతో బీజేపీ రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం అమలుపరుస్తున్న పథకాలను, జాతీయస్థాయి విజయాలను, రాష్ట్రస్థాయి విజయాలను ప్రజలకు తెలుపుతూ మోదీ గ్యారెంటీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, 37వ డివిజన్ అధ్యక్షుడు గోల రాజ్ కుమార్ మిరియాల అరుణ్, వల్లెపు రాజు, రమేష్, నిరంజన్, నాగరాజు, శంకర్, నరసింహ, సంపత్, రామకృష్ణ, మల్లయ్య, ముఖేష్, కుమార్, రాకేష్, కేశవ్, నాగార్జున, పాషా, గొల్లన రవి, బొంత రాజు, సంపంగి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుకొండ మండలం మనుగొండ గ్రామంలో శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకులు సామాజికవేత్త అల్లం బాలకిషోర్ రెడ్డి సహకారంతో సొంత ఖర్చులతో ఉచిత వైద్య శిబిరం చైతన్య శ్రీ నర్సింగ్ హోమ్ డాక్టర్ శోభారాణితో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అల్లం మర్రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందికొండ రాజు, మాదాసి రాంబాబు, ప్రధాన కార్యదర్శి కునమల్ల అనిల్, చాపర్తి కనకయ్య, తోట కమలాకర్, దేవ నాగరాజ్, గుండా కొమ్మాలు, గుండా రాము, వందలాది మంది మనుగొండ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా

### మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ కార్పొరేటర్ మారుపల్ల రవి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కార్యకర్తలు చాలా కష్టపడ్డారని, కష్ట పడిన ప్రతి కార్యకర్తకు నా రెండు చేతులు జోడించి నమస్కరించారు. కార్యకర్తలే నా బలం, కార్యకర్తలకు ఏ చిన్న హాని జరిగిన ఊరుకునేది లేదని, ఎంతటికైనా కొట్లాడటానికి సిద్ధమన్నారు. వరంగల్ తూర్పు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను నా గుండెల్లో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కి కార్యకర్తలే పట్టుకొమ్ము లాంటి వాళ్లు, కార్యకర్తలు ఎవరు కూడా ఓడిపోయామనే దిగులు చెందకుండా ధైర్యంగా ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లవేళలా ప్రతి నిమిషం అందుబాటులో ఉంటామని, అంతేకాకుండా మీకు ఏ చిన్న ఆపద వచ్చినా తోడుగా ఉంటానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డివిజన్ కార్పొరేటర్ మారుపల్ల రవి, డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, డివిజన్ ఇంచార్జ్ వొగిలిశెట్టి అనిల్, మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరవి, వనం మధు, వనం కుమార్, కోరే కృష్ణ, యేర కోటేశ్వర్, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, యూత్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవితరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కావటి కవితరాజు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సోల రాజు, పొగాకు సదానందం, రాంకీ యాదవ్, జూలూరి వాసు, ఐలయ్య, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, యూత్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## జాతరలో అధికారులు అందుబాటులో ఉండాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** జాతరలో అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శనివారం మేడారంలోని ఐటీడీఏ క్యాప్ ఆఫీస్ లో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి, వారికి ముఖ్యంగా మూత్రశాలలు, నీటి సౌకర్యం నిరంతరం ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిలకల గుట్టను సందర్శించారు. జాతర సమయంలో చిలకల గుట్ట పరిసర ప్రాంతాలలో రద్దీ, అమ్మవారిని తీసుకువచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, దేవాదాయ శాఖ అధికారి రాజేందర్, సర్కిల్ ఇన్ స్పెక్టర్ శంకర్, పూజారులు సంఘం అధ్యక్షుడు జగ్గారావు , స్థానిక ఎమ్మార్వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన చేనేత కార్మికులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట చేనేత సహకార సంఘానికి రావాలసిన పెండింగ్ బకాయిలు, సంఘంలో నిల్వ ఉన్న చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో నిన్న రాత్రి హైదరాబాదులోని మినిస్టర్స్ క్వాటర్స్ లో చేనేత కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా వారు చేనేత సహకార సంఘం కార్మికులు సహకార సంఘానికి రావాల్సిన పెండింగ్ బకాయిలు ఇప్పిస్తూ, నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం తరుపున కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించవలసిందిగా కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత కార్మికులకు సంబంధించిన బకాయిలు చెల్లించడంతో పాటు ప్రభుత్వం తరఫున చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వారికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి చిందం రవి, సహకార సంఘం పీఏసీ చైర్మన్ మామిడి శంకర్ లింగం, పాలకవర్గ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, బాసాని సాంబయ్య, దిడ్డి ప్రభాకర్, సంఘం మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, కర్షక రక్షణకు దేశవ్యాప్త బంద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశీయ వ్యవసాయాన్ని, రైతాంగాన్ని, కార్మిక హక్కుల్ని రక్షించి దేశాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్-కార్మిక సమ్మె జరుగుతున్నదని,అన్ని వర్గాల ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేయం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, గోనె కుమారస్వామి, జిల్లా కన్వీనర్లు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, కార్మిక సంఘాల జిల్లా బాధ్యులు గంగుల దయాకర్, ముక్కెర రామస్వామి, నర్ర ప్రతాప్, గన్నారపు రమేష్, పుల్ల రమేష్, సుంచు జగదీశ్వర్, జిల్లా నాయకులు, ఓదెల రాజన్న, కోరబోయిన కుమారస్వామి, ఎండీ ఇస్మాయిల్, కందిక చెన్నకేశవులు, ఎండీ కాసిం, గజ్జల లింగమూర్తిలు పిలుపునిచ్చారు. శనివారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేయం), కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీల ఆధ్వర్యంలో జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ ల అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు కార్మిక రాష్ట్ర జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మోడీ ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతాంగాన్ని దివాలా తీయించి విదేశీ కార్పొరేట్ శక్తులకు దేశీయ వ్యవసాయాన్ని కట్టెందుకు చట్టాలను రూపొందించారని మండిపడ్డారు. మతోన్మాద మనువాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలు బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదని, వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కుటిల నీతితో పనిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే ప్రజాస్వామ్యం కూనరిల్లి నియంతృత్వం పెచ్చరిల్లుతుందని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తం కావాలని కోరారు. ఈ కార్యక్రమ జయప్రదం చేయడానికి మండల డివిజన్ స్థాయిలో సదస్సులు, ఈనెల 16న నర్సంపేట, వర్ధన్నపేట జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యకర్తలు ఐతం నాగేష్, అశోక్, ఊరటి అంశాల రెడ్డి, మోకిడి పీరయ్య, మైదం పాణి పాల్గొన్నారు.

# గ్యాస్ సమాచార నమోదులో పారదర్శకత అవసరం



## బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధికా గుప్తా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్యాస్ సిలిండర్ సంబంధిత సమాచార నమోదులో పారదర్శకత అవసరమని బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధికా గుప్తా అభిప్రాయపడ్డారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఇంజినీరింగ్, శానిటేషన్, మెప్మా, అంగన్వాడీ సిబ్బందితో అభయహస్తం గ్యారెంటీ పథకాల అమలులో భాగంగా ప్రభుత్వం లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే సబ్సిడీ గ్యాస్ సిలెండర్ లు అందజేయడానికి సంకల్పించిన తరుణంలో సంబంధిత సమాచార నమోదు ఒకే రోజులో పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంచార్జి కమిషనర్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా 66వ డివిజన్లలో 40వేల దరఖాస్తులకు చెందిన గ్యాస్ సిలెండర్ల సమాచారం అస్పష్ట గా ఉందని, ఆ సమాచారాన్ని సరిచేయడానికి ఒకే రోజులో యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. సమాచార నమోదులో ఆర్పీలు, అంగన్వాడీలు నిబద్ధత పాటించాలని, రేషన్ కార్డు ప్రామాణికంగా గ్యాస్ కంజ్యూమర్ నంబర్, ఏజెన్సీ పేరు మాత్రమే నమోదు చేయాలని, క్షేత్ర స్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు సూపర్ విజన్ చేస్తారని, సమాచార నమోదులో ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఆర్పీలు, అంగన్వాడీలు, జవాన్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని సాధిస్తారని ఇంచార్జి కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ఓ డా.రాజేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, టీపీఆర్ఓ రాజేష్ కుమార్, టీఎంసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీవీకి భారత రత్న హర్షణీయం

## బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ముద్దు బిడ్డ, బహుభాషాకోవిదుడు, తొలి తెలుగుప్రధాని పీవీనరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం ప్రకటించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యపోరాటంలో వారు నిర్వహించిన పాత్ర మరువరానిది అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా భూ సంస్కరణల చట్టాన్ని తెచ్చి భూస్వాముల కన్నెర్రకు గురైనా లక్షలాది ఎకరాల భూస్వాముల మిగులు భూములు పేదలకు పంపిణీ చేయటంతో పాటు, 1000 ఎకరాల తమ సొంత భూములను పేదలకు పంచి ఆదర్శప్రాయుడిగా నిలిచారన్నారు. తొలి తెలుగు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేశారని తెలిపారు. నేటి పాలకులు వారిని ఆదర్శంగా తీసుకుని పాలన కొనసాగించాలన్నారు. అలాగే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ కు కూగా భారత రత్న ప్రకటించడం పట్ల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. రైతు పండించిన పంటకు ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలను నిర్ణయించి అమలు చేస్తే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాలకు వీర్బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వాటర్ ప్యూరిఫైయర్ ను పేద విద్యార్థుల కోసం బహూకరణ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. విర్బాక్ అనిమల్ హెల్త్ కంపెనీ వందలాది విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీరు శుద్ధికరణకు ఎంతో విలువైన వాటర్ ప్యూరిఫైయర్ యంత్రాన్ని ఉచితంగా కంపెనీకి అందించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కళాశాలలో మంచి నీరు కోసం ఇది ఎంతో ఉపకరిస్తుందన్నారు. కంపెనీ ఇంతటి మానవతా సహాయాన్ని చేసినందుకు వర్బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ కంపెనీని ప్రిన్సిపల్ అభినందించారు. ఆ కంపెనీకి సంబంధించిన అధికారులు డాక్టర్ కృష్ణ సాహూ పీఎంటీ, ఎండీ సిరాజుద్దీన్ ఆర్ఎస్ఎం, వి మహేష్ ఏఎస్ఎం, ఎస్ రమేష్ బీఓ, కే రాజ్ కమల్ ఎస్ఓ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే రాజేందర్ రెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డిప్యూటీ డీఎంహెచ్ఓకు సమ్మె నోటీస్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎన్ హెచ్ఎం అల్ క్యాడర్స్ ఉద్యోగులు 16న హైదరాబాద్ డీహెచ్ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర కార్యాలయం ముందు సమ్మె విజయవంతం చేయాలని ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు డిసెంబర్, జనవరి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని రామా రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ విద్యాసాగర్ రెడ్డి, మెరుగు అనిల్ కుమార్, నూర సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ జయరాజుకు అవార్డు



**వరంగల్ వాయిస్ మడికొండ :** హనుమకొండ జిల్లా, కాజీపేట పట్టణం, మడికొండ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి.జయరాజుకు ఆలూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ తెలంగాణ వారు ఉత్తమ పోలీస్ అవార్డును 2024ను హైదరాబాదులోని రవీంద్రభారతిలో శనివారం అందించారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని జయరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ తెలంగాణ అధ్యక్షుడు ఆలూరి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఎన్.ఇందిర, గౌరవ అధ్యక్షురాలు అంజనీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన మహంకాళి వెంకన్న తన సొంత అక్క దూడపాక ఉప్పలమ్మను ఈ నెల 6 న మద్యం సేవించడానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదని మాటువేసి మాటేడు ఎస్సీ కాలనీ అంబేద్కర్ బొమ్మ వద్ద గొడ్డలితో మెడపై నరికి హత్య ప్రయత్నం చేశారు. ఈ కేసులో మహంకాళి వెంకన్నను శనివారం అరెస్టు చేసి రిమాండ్ చేయడం జరిగింది.

# సీఐని కలిసిన కాంగ్రెస్ మండల నాయకులు



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** మండలానికి కొత్తగా వచ్చిన సర్కిల్ ఇన్ స్పెక్టర్ బాబూలాల్ ను శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బోకే ఇచ్చి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లం మర్రెడ్డి , మండల అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ జిల్లా నాయకులు సాయిలి ప్రభాకర్ కొమ్ము, శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి కూసం రమేష్, నాగరాపు స్వామి, మనుగొండ గ్రామ అధ్యక్షుడు కందికొండ రాజు, మాదాసి రాంబాబు, గ్రామ కార్యదర్శి అనిల్, గాడిదల బంధాలు, మహేందర్, కమలాకర్, సూరయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ప్రచార కార్యదర్శిగా వారణాసి మోహన్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ వరంగల్ అర్బన్ ప్రచార కార్యదర్శిగా నగరానికి చెందిన విద్యార్థి నాయకుడు వారణాసి మోహన్ ను నియమించారు. ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను బీసీ సంక్షేమ సంఘం వరంగల్ అధ్యక్షుడు అప్పరాజు రాజు శనివారం జారీ చేశారు. బీసీ సంక్షేమ సంఘానికి పూర్తిస్థాయిలో తన సహకారాన్ని అందిస్తారని అప్పరాజు రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని వారు తెలిపారు. తన నియామకానికీ సహకరించిన తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవి కృష్ణ, అర్బన్ అధ్యక్షుడు ఆప్పరాజు రాజుకు, డా.అదేపు రాజేంద్రప్రసాద్ కు వారణాసి మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

# గుంతల, లీకేజీల మయంగా కాలనీలు పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధిలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నియోజక వర్గంలో ఎల్బీ నగర్, తిలక్ రోడ్డు నిత్యం వ్యాపారుల విద్యార్థుల వినియోగ దారుల ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారి. అలాంటి రోడ్డు గత ఏడాది కాలంగా తాగునీటి పైప్ లైన్ లీకేజీలతో వివిధ రకాల గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్ని సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యలను విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. లీకేజీల వలన కలుషిత మంచినీటిని ప్రజలకు అందించడం వల్ల అనారోగ్య పాలవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి లీకేజీలను గుంతలను మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

# ప్రధానోపాధ్యాయులకు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల మట్టేవాడలో జీటీఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని గెజిటెడ్ హెడ్మాస్టర్ లందరికీ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ డీఈఓ డి.వాసంతి , హనుమకొండ డీఈఓ అబ్దుల్ హై విచ్చేసి హెడ్మాస్టర్ లందర్ని శాలువాలతో సన్మానించారు. ఇందులో జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మేరోజు బ్రహ్మచారి, కోశాధికారి సపవత్ నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రవి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గుజ్జ వెంకటేశం, ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షులు పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, జిల్లా, మండల బాధ్యులందరూ పాల్గొన్నారు.

# టీపీటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

## జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు ఫిబ్రవరి 11, 12న ఖమ్మం పట్టణంలోని నయాబజార్ హైస్కూల్ లో నిర్వహించబడుతున్నాయని దానిని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ విద్యా మహాసభలలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, ప్రొఫెసర్ బుర్ర రమేష్, ప్రొఫెసర్ హరగోపాల్, వీక్షణం వేణుగోపాల్, ఏ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ కాసిం ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ, హేతువాద రచయిత్రి చందన చక్రవర్తి, తదితరులు పాల్గొంటున్నారు. మహాసభలను విజయవంతం చేయడం కోసం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని వివిధ పాఠశాలల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోజ్ గౌడ్ మాట్లాడుతూ అందరికీ సమానమైన విద్య అందినప్పుడే సమ సమాజం ఏర్పడుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు విద్యాశాఖ(ఓడీ) ఆన్ డ్యూటీ సౌకర్యం కూడా కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, పూర్వపు జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటుకూరి అశోక్, ఉపాధ్యాయ దర్శిని పూర్వ సంపాదక వర్గ సభ్యులు బైరి స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు జటబోయిన స్వామి, జిల్లా కౌన్సిలర్ కే బుచ్చయ్య చారి, ఖిలా వరంగల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూర్ణచందర్, రమేష్, వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీ బ్యానర్, కరపత్రాల ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ లో తెలంగాణ స్వచ్ఛంద సంస్థల సమాఖ్య, రాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లాల కన్స్యూమర్ ఆర్గనైజషన్ ల ఆధ్వర్యంలో "మేడారం"కు దారి చూపే ఫ్లెక్సీ బ్యానర్, ప్లాస్టిక్ రహిత మేడారానికి సంబంధించిన "కరపత్రాలు" ప్రారంభోత్సవం కన్స్యూమర్ ఆర్గనైజషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ రతన్ సింగ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య అధ్యక్షులు, కన్స్యూమర్ ఆర్గనైజషన్ రాష్ట్ర కార్యదర్శి గిరగాని సుదర్శన్ గౌడ్ ల చేతుల మీదుగా శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ మెంబెర్ బంద కాళిదాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, స్వయంకృషి సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్, ఛాయా సంస్థ ప్రతినిధి కోట డేవిడ్, వినియోగదారుల ఫోరం నుంచి నాగెల్లి సారంగం గౌడ్, కన్స్యూమర్ ఫోరం మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మైస వసంత, యూత్ ప్రసిడెంట్ ఎర్రబోయిన కిషన్, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

## ఎంపీపీ బాదావత్ విజేందర్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక సమావేశాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ బాదావత్ విజేందర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల మౌలిక సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని హైస్కూల్ లో స్పెషల్ క్లాస్సెస్ ను నిర్వహించాలని, విద్యార్థులు 100 శాతం పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయాయులు కృషి చేయాలని కోరారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వారి పాఠశాలల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచే విధంగా కృషి చేయాలని తెలిపారు. అందరూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. మండలంలోని డిప్యూటేషన్ టీచర్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఉపాధ్యాయులు పాఠశాలల సమస్యలు తెలుపుతూ ప్రతి పాఠశాలలో స్కావెంజెర్ ను నియమించాలని ఎంపీపీని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈ భారతి, మండల విద్యాశాఖాధికారి వి.రత్నమాల, మండల నోడల్ ఆఫీసర్ బి.సరళ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాపమ్మ, ప్రభాకర రావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సలీమ్, జయ, రవీందర్, ఉపాధ్యాయులు రవీందర్ రెడ్డి, కొమురయ్య, ఇంద్రయ్య, సురేందర్, రమేష్, కుమారస్వామి, ఇంద్రసేనారెడ్డి, హామీదా బాను, పవన కుమారి, హేళన్ దేవా కుమారి, నర్సయ్య, శ్రీనివాస్, రవి, ఆంజనేయులు, ఎంఆర్ సీ సిబ్బంది అశోక్, యాదగిరి, సీఆర్పీలు సంపత్, బాలు,హేమలత తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ తమిళి సైని కలిసిన తిరుపతిరెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళ్ సై సౌందర్ రాజన్, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ల ను ప్రముఖ విద్యావేత్త, ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి రాజ్ భవన్ లో శనివారం కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతి రెడ్డి "నేటి విద్యా విధానం– సమూల మార్పులు" అనే అంశం పై నివేదికను గవర్నర్ కు అందజేయడం జరిగింది. ఇందులో ప్రస్తుతం భారతదేశంలో చదువులకు, ఉద్యోగ నైపుణ్యాలకు మధ్య సంబంధం ఉండడం లేదని, ప్రతి పది మందిలో ఒకరికి ఉద్యోగ నైపుణ్యాలు ఉంటున్నాయని, ఎప్పుడో కాలం చెల్లిన నాటి ఉద్యోగాలకు తగ్గట్టు విద్యాబోధన ఉండడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని తెలుపుతూ విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను కూడా అందించాలని సూచించారు. సామాజిక, భావోద్వేగ అభివృద్ధితో పాటు బతికేందుకు అనువైన సంపూర్ణమైన చదువు ప్రస్తుత విద్యా విధానంలో అవసరమని, బోధన పద్ధతులతో పాటు, నిర్మాణాత్మక బోధనా అంశాల్లో కూడా మార్పులు చేయాలని సూచించారు. కాలం చెల్లిన విద్యా విధానాలను వదిలేసి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన కోర్సులను పాఠశాల స్థాయి నుంచే విద్యా విధానంలో జోడించాలని తెలిపారు. గవర్నర్ డాక్టర్ తమిళ్ సై సౌందర్ రాజన్ స్పందిస్తూ ఎంతో అనుభవం ఉన్నటువంటి విద్యావేత్తలు, మేధావుల సలహాలను ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు తీసుకొని మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యా విధానంలో ఎప్పటికప్పుడు సమూల మార్పులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ పబ్లిషర్స్ అధినేత డాక్టర్ కేఎస్ఆర్ శ్రీనివాస్, విద్యా సంస్థల ప్రముఖులు సాంబయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

# నాలాల్లో చెత్తా, చెదారాన్ని తొలగించాలి

## బీజేపీ నేత నార్లగిరి రామలింగం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 61వ డివిజన్ లో నాలాలలో చెత్తా, చెదారం అలాగే ఉంటుందని, మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, తక్షణమే నాలాలు శుభ్రం చేసి మురుగు నీరు నిలవకుండా ఉండే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. అలాగే నాలాలపై అక్రమంగా కట్టడాలు వెలుస్తున్నాయనీ, దీనిపైన టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అదే కాకుండా ఈ డ్రైనేజీ మురుగులో పెరిగిన చేపలను రోజు మద్యం షాపుల దగ్గర జీవనం గడుపుకునే వారు, ఈ చేపలను పట్టి ఫ్రై చేసి అమ్ముతున్నారన్నారు. దీనిపైన మున్సిపల్ అధికారులు అంటీ పట్టినట్టుగానే ఉంటున్నారన్నారు. తక్షణమే ఈ అక్రమ కట్టడాలపైన విచారణ జరిపించాలనీ, అదేవిధంగా నాలాలలో మురుకు నీరు నిలువ లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ దీనిపై వెంటనే స్పందించాలని, అక్రమ కట్టడాలపైన విచారణ జరిపించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవి, హలీం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల కిడ్నాప్ వదంతులు ప్రజలు నమ్మొద్దు

## కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్

**వరంగల్ వాయిస్, కాజీపేట :** ఈ మధ్య చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగులు తిరుగుతున్నాయని, పిల్లలకు చాక్లెట్లు, మత్తు పదార్థాలు ఇస్తూ కిడ్నాప్ చేస్తున్నారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ప్రజలు ఇలాంటి వదంతులు ఎవరు నమ్మకూడదనీ కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇలాంటి వదంతులను వైరల్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే వారిని గుర్తించి చట్టపరమైన చర్య తీసుకోబడునన్నారు. ప్రస్తుతం పిల్లల్ని కిడ్నాప్ చేసే గ్యాంగ్ లు ఎలాంటివి లేవనీ, పిల్లల తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దన్నారు. ఒకవేళ ప్రజలు ఎవరైనా అపరిచిత వ్యక్తులను గుర్తించినచో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ తెలియజేశారు.ద

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని పాత ముగ్ధంపురం గ్రామానికి చెందిన మాదాసి రమేష్ తండ్రి మాదాసి ఎల్ల స్వామి ఇటీవల మరణించాడు. వారి కుటుంబానికి ఆటో యూనియన్ సభ్యులు 10 వేల రూపాయల ఆర్థికసహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గుర్రం భిక్షపతి, ఉపాధ్యక్షుడు రాకేష్, గౌరవ అధ్యక్షులు బండారి సత్యం, వంగపల్లి రాజు, గౌరవ సలహాదారుడు సంపత్, సభ్యులు మధురుకోళ్ల భిక్షపతి, దుండి రంజిత్, వల్ల, సదానందం, కుసుమ మల్లయ్య, సుంకరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# వనదేవతలను దర్శించుకున్న సోదా అనిత-రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** మేడారం వన దేవతలను పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు.

# ఫిష్ ఫుడ్ కియాస్కో సెంటర్‌ను సందర్శించిన డీఎఫ్ఓ అల్లు నాగమణి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండల కేంద్రంలో ఉన్న ఫిష్ ఫుడ్ కియోస్క్ సెంటర్ ను మహబూబాబాద్ జిల్లా మత్స్య శాఖ డీఎఫ్ఓ అల్లు నాగమణి, జిల్లా చీఫ్ ప్రమోటార్ కొత్తూరు రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సెంటర్ ను నిర్వహిస్తున్న గుర్తూరు గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షుడు పిల్లి నాగరాజును అభినందించారు. డీఎఫ్ఓ అల్లు నాగమణి మాట్లాడుతూ గత కొద్ది సంవత్సరాలుగా డివిజన్ కేంద్రంలో చేపల వంటకాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న నాగరాజులా ప్రతి ఒక్కరూ ఆర్థిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు.

# ఘనంగా జంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు

## భద్రకాళిని దర్శించుకున్న జంగా దంపతులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం భద్రకాళి అమ్మవారిని జంగా దంపతులు దర్శించుకొని పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాజీపేట సమీపంలోని స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





### అన్నదానం...

**వరంగల్ వాయిస్, మడికొండ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ జంగారావు రెడ్డి 59వ పుట్టినరోజు సందర్భంగా శనివారం మడికొండ చౌరస్తాలో మానుపాటి కిరణ్ అలియాస్ మాస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు తొట్ల రాజు యాదవ్, ఉనికిచెర్ల మాజీ సర్పంచ్ జక్కుల సారయ్య యాదవ్, 46, 47వ డివిజన్ల కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్, సందెల విజయ్ కిషన్ మండల అధ్యక్షుడు నీలం వేణు యాదవ్, కిషన్, గ్రామ శాఖ అధ్యక్షులు దువ్వ విజయ్, అర్జున్, గణేష్ యాదవ్, టేకుమట్ల నాగరాజు యాదవ్, గడుసు రాజు, రొట్టె బండ గోపి, ప్రశాంత్, వేణు, శీను, సునీల్, కొలంబో అశోక్, చంటి, వినయ్ పాల్గొన్నారు.

# విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నూతన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగం బలోపేతం కోసం ఆశించినంతగా నిధులను కేటాయించకుండా కేవలం 21,389 కోట్ల 7.75% నిధులను కేటాయించి నిరాశపరిచిందని, విద్యారంగం బలోపేతం కోసం కృషి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే విద్యారంగాన్ని బడ్జెట్ లో నిరాశపరిచిందని హకీమ్ నవీద్ అన్నారు. ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి అత్యంత ప్రధాన్యత ఇవ్వవలసినటువంటి పరిస్థితి నుంచి వైదొలిగిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధి కోసం కేటాయించినటువంటి రూ.500 కోట్లు కనీసం యూనివర్సిటీల మౌలిక వసతుల సదుపాయాల కోసం సరిపోవని ఆయన అన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజ్ రీయింబర్స్ మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ బడ్జెట్ లో వాటి ప్రస్తావన లేకుండా పోవడం విద్యార్థులకు నిరాశపరిచిందని మండిపడ్డారు. తక్షణమే బడ్జెట్ ప్రతిపాదనలను సవరించి ప్రొఫెసర్ కొఠారి కమిషన్ ప్రతిపాదించిన విధంగా రాష్ట్ర బడ్జెట్ లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాల్సిందిగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆగ్రహానికి గురి కాక తప్పదని ఆయన హెచ్చరించారు.

# పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికలంటూ హడావిడి

## అర్హులైన జర్నలిస్టులకు మొండి చెయ్యి



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల ప్రెస్ క్లబ్ ఎన్నికలు అంటూ కొంతమంది జర్నలిస్టులు హడావిడి చేస్తున్నారు. జిల్లా యూనియన్ సంఘాలు ఐజేయూ, ఎన్ హెచ్ 143, సంఘాల నుంచి సభ్యత్వాలు స్వీకరించిన వారికి కూడా చోటు కల్పించకుండా అదేవిధంగా గతంలో పరకాల ప్రెస్ క్లబ్ నుంచి సభ్యత్వం తీసుకున్న వారికి కూడా ఓటు హక్కు కల్పించకుండా వారి ఇష్టారీతిన నిర్వహించేందుకు సిద్ధపడ్డట్లు కొంతమంది జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. అసలు విషయం ఏమిటంటే గతంలో జర్నలిస్టులు పరకాల ప్రెస్ క్లబ్ కు యూట్యూబ్ ఛానల్స్, పీడీఎఫ్ పత్రికల జర్నలిస్టులకు ప్రవేశం లేదంటూ ఏకంగా వాల్ పోస్టర్ రాశారు. అందులో భాగంగా యూట్యూబ్, పీడీఎఫ్ పత్రికల జర్నలిస్టులు ఒక వేదికగా ఏర్పడి డిజిటల్ మీడియా పాయింట్ ఏర్పరుచుకొని వార్తలు సేకరిస్తున్నారు. ఈ విధానం కొంతమంది జర్నలిస్టులకు నచ్చక వీరిని ఎలాగైనా ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో వారికి ఓటు హక్కును కల్పించకుండా అడ్డుకుంటున్నారనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా హనుమకొండ జిల్లా రెండు యూనియన్ బాధ్యులు చొరవ తీసుకొని అర్హులైన జర్నలిస్టులకు ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించే విధంగా చేయాలని పలువురు జర్నలిస్టులు కోరుతున్నారు. అదేవిధంగా వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులకు, రెండు యూనియన్ల అధ్యక్ష కార్యదర్శులకు, పరకాల ప్రెస్ క్లబ్ లో నిజ నిర్ధారణ కమిటీ వేసి అర్హులైన జర్నలిస్టులకు ఓటు హక్కు కల్పించాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

# డీసీపీ సెంట్రల్ జోన్ భవన సందర్శన



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కాజీపేటలోని ప్రగతి నగర్ లో కొత్తగా నిర్మించబోయే డీసీపీ సెంట్రల్ జోన్ భవనాన్ని శనివారం సందర్శించారు. కాజీపేట ఇన్ స్పెక్టర్ సార్ల రాజు, కాజీపేట ఎస్సైలు శివకృష్ణ, లవన్ కుమార్ లకు పలు సూచనలను చేశారు.

# రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ వారు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో తలసేమియా బాధితుల కోసం శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్త దాన శిబిరాన్ని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, జిల్లా పాలకవర్గ సభ్యులు పోట్లపల్లి శ్రీనివాసరావులు సందర్శించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాగే ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఓబీ బ్యాంక్ మేనేజర్ పి.కల్యాణ సుందరం, స్టాఫ్ వెంకట శివ, టాటా ఇన్సూరెన్స్ మేనేజర్ మధుసూదన్, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, బ్యాంక్ ఉద్యోగులు, ఇన్సూరెన్స్ ఉద్యోగులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బడ్జెట్ వాస్తవికంగా ఉండాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవికంగా ఉండాలని, గొప్పలకు పోయి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ గత బీఆర్ఎస్ పాలన వల్ల రాష్టం అప్పుల రాష్టంగా మారిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. ప్రభుత్వ బడ్జెట్ లో యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాల కొసం కేటాయించిన 500 కోట్లు ఏ మేరకు సరిపడవని ప్రతి యూనివర్సిటీకి 300కోట్ల నిధులు కేటాయించి ఉన్నత విద్య ప్రమాణాల పెంపుకు కృషి చేయాలని, కొత్తగా గురుకుల భవనాలే నిర్మాణం కాకుండా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్ కు కూడా సొంత భవనాల నిర్మాణానికి కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు 5500 కోట్లు ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులో కోత విధించవద్దని, పెండింగు ప్రాజెక్టుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# మంత్రి సీతక్కను కలిసిన పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి సీతక్కను, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి లను శనివారం డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో భాగంగా వరంగల్ నుంచి ఎంపీ బరిలో రామకృష్ణ నిలబడే ప్రయత్నం తెలియజేస్తూ మంత్రి సీతక్క ఆశీస్సులు తీసుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను కూడా వరంగల్ ఎంపీ బరిలో నిలబడాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులు, మంత్రుల, ఎమ్మెల్యేల సహకారాలు, అదేవిధంగా ప్రజల ఆశీస్సులు తమపై ఉండాలన్నారు. ప్రజలకు నేను చేసిన సేవే నన్ను గెలిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన చాలా అద్భుతంగా ఉందని, ప్రజలందరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలని విజయవంతంగా పూర్తి చేస్తారని రామకృష్ణ అన్నారు.

# నిరుద్యోగ యువతులకు అవగాహన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కేంద్రంలోని హోటల్ గ్రాండ్ గాయత్రిలో నిరుద్యోగ యువతులకు వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధి, శిక్షణ డైరెక్టరేట్ నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంకల్ప్ పథకం అమలులో భాగంగా అవగాహన శిక్షణ కార్యక్రమం ఏపీపీసీహైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మాధవి హాజరై మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులందరూ ఎంప్లాయిమెంట్ కార్డు తీసుకోవాలని, ప్రతి ఒక్కరు ఈ లాంటి శిక్షణ కార్యక్రమాలను ఉపయోగంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి బ్యాగు, సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆఫీస్ నుంచి డీఆర్ఐ ఉమేష్, గవర్నమెంట్ కాలేజి ఐటిఐ ప్రిన్సిపల్ జూమ్లా నాయక్, జేఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మసీదున్, ఏపీపీసీ ప్రతినిధులు నసీర్ సిద్ధికి, కోటేష్, షేక్ పైజాన్, జిల్లా కోఆర్డినేటర్ షఫీ ఉర్రహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



# వరుస హత్యల ఆధారంగా..

## భూతద్ధం భాస్కర్ నారాయణ

టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. ఈ సినిమాకు పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. స్నేహాల్, శశిధర్, కార్తీక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మార్చి 31వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇక విడుదల తేదీకి ఇంకా నెల రోజులు ఉండగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రబృందం. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. కర్ణాటక ఆంధ్ర బోర్డర్‌లో జరిగిన వరుస హత్యల ఆధారంగా ఈ సినిమా రానున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ హత్యలు ఎవరు చేశారు అని కనిపెట్టే డిటెక్టివ్ భాస్కర్ నారాయణ పాత్రలో శివ కందుకూరి నటిస్తున్నాడు. క్రైమ్ థ్రిల్లర్‌గా రానున్న ట్రైలర్ ప్రస్తుతం యుట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఈ సినిమాలో రాశి సింగ్ కథానాయికగా నటిస్తుండగా.. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు.

# శ్రద్ధాదాస్ అందాల ఆరబోత

అటు హిందీలోనూ, ఇటు దక్షిణాదిలోనూ బిజీగా వున్న నటీమణుల్లో శ్రద్ధ దాస్ ఒకరు. 2008లో 'సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం' అనే తెలుగుసినిమాతో వెండితెరపైకి ఆరంగేట్రం చేసిన శ్రద్ధ దాస్ ఇప్పటివరకు సుమారు 40 సినిమాలకిపైగా వివిధ భాషల్లో చేసింది. అందులో ఎక్కువగా దక్షిణాదికి చెందినవే. సినిమాలతో పాటుగా శ్రద్ధ కొన్ని వెబ్ సిరీస్ లలో కూడా నటించింది. మాస్ కమ్యూనికేషన్ లో డిగ్రీ పూర్తి చేసిన శ్రద్ధ దాస్ ఎప్పుడూ సామజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన అభిమానులకి అప్పుడప్పుడు స్పెషల్ ఫోటోషూట్ చేస్తూ కనువిందు చేస్తూ ఉంటుంది. ముంబైలో పుట్టి, అక్కడే పెరిగిన శ్రద్ధ దాస్ తల్లిదండ్రులు బెంగాల్ కి చెందిన వారు. అందుకే చిన్నప్పుడు ఎక్కువగా బెంగాల్ వెళుతూ ఉండేదానిని అని చెపుతూ ఉంటుంది శ్రద్ధ దాస్.



# సితార పేరుతో నకిలీ ఇన్‌స్టా

## పోలీసలకు ఫిర్యాదు చేసిన మహేశ్ కుటుంబం

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కుమార్తె సితార పేరుతో కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారు. సితార ఘట్టమనేని పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాలు తెరిచి ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ లింకులు పలువురికి పంపుతున్నట్లు జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ గుర్తించింది. ఇటువంటి వాటిని నమ్మొద్దని ఆ సంస్థ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. దీనికి సంబంధించి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెలబ్రిటీల పేరుతో ఇలాంటి లింకులు వస్తే అప్రమత్తంగా ఉండాలని జీఎంబీ సంస్థ సూచించింది. సితార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా కనిపించే ఆమె సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటుంది. అప్పుడప్పుడు తన తండ్రి పాటలకు స్టెప్పులేస్తూ సందడి చేస్తుంటుంది. తాజాగా గుంటూరు కారం చిత్రం నుంచి దమ్ మసాలా సాంగ్‌తో అలరించింది.






# వెన్నెల కిశోర్ హీరోగా.. చారి 111

టాలీవుడ్ స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111'. తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఫిబ్రవరి 12న సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే ఓ సీటిలో అనుమానాస్పద ఘటనలు జరుగుతుంటాయి. అవి చేధించే రహస్య గూఢచారి పాత్రలో వెన్నెల కిషోర్ కనిపించనున్నారు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కిశోర్ సీక్రెట్ స్పైగా కనిపించనుండగా.. మురళి శర్మ స్పై ఏజెన్సీ హెడ్?గా కనిపించనున్నారు. ఈ సినిమాను బర్కత్ స్టూడియోస్ బ్యానర్‌పై అదితి సోని నిర్మిస్తుంది.



# బీజేపీ పిలుస్తోంది రండి..

### పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేయాలి

### పార్లమెంట్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలి

### వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించడమే లక్ష్యంగా బీజేపీ పిలుస్తోందని.. ప్రతీ ఒక్కరూ పార్టీలో చేరాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో రండీ బీజేపీలో చేరండి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి కేంద్ర ప్రభుత్వ ఫలాలు అందేలా, నవభారత నిర్మాణం కోసం పని చేస్తున్న ప్రధాని మోడీ రుణం తీర్చుకునేలా ప్రతి బీజేపీ కార్యకర్త పని చేయాలన్నారు. పేదల గడపల్లో నాటి రామరాజ్యం వచ్చేలా దేశ భవిష్యత్ కు బంగారు బాట వేసేందుకు ప్రతీ ఒక్కరు బీజేపీలో చేరాలని గంట రవికుమార్ పిలుపునిచ్చారు. మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన అనేక పథకాలను బూత్ స్థాయిలో ప్రతీ గడపకూ చేరేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. ఫిబ్రవరి 11 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతీ బూత్ నుంచి ఐదుగురిని పార్టీలో చేర్పించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని, ఇందుకోసం ప్రతీ బీజేపీ నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. మోడీ ఓరుగల్లు జిల్లాకు ఎన్నో పథకాలు కేటాయించారని పేర్కొన్నారు. ఆయనకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు పార్లమెంట్ సీట్లను కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రత్నం సతీష్ షా, ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, రేసు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్లు వడ్డేపల్లి నరసింహులు, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థులు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, కంభంపాటి పుల్లారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బన్న ప్రభాకర్, నర్సంపేట టౌన్ అధ్యక్షులు బాల్నే జగన్, బీజేపీ నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బండారి కళ్యాణి, యువ మోర్చా అధ్యక్షులు భరత్ వీర్, పదాధికారులు, పలు డివిజన్ అధ్యక్షులు, పలు మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐక్యతా మహా సభలను విజయవంతం చేయాలి

### పాల్గొననున్న మూడు విప్లవ పార్టీలు

### సీపీఐఎంఎల్ మాస్ లైన్ రెవల్యూషనరీ ఇనిషియేటివ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం

**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** ఖమ్మంలో మార్చి 3న సీపీఐ(ఎంఎల్) ఆర్ ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీసీ సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడు విప్లవ పార్టీల ఐక్యతా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రెవల్యూషనరీ ఇనిషియేటివ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం పిలుపునిచ్చారు. మార్చి 3న సాయంత్రం 3.30గంటలకు ఎస్సీర్, బీజీఎన్ ఆర్ కళాశాల గ్రౌండ్ నుంచి పెవిలియన్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సాయంత్రం 5గంటలకు కామ్రేడ్ రవన్న సంతోష్ రాణా నగర్ గా నామకరణం చేసిన పెవిలియన్ గ్రౌండ్ లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కామ్రేడ్ కెచ్చెల రంగయ్య అధ్యక్షతన నిర్వహించనున్న ఈ భారీ బహిరంగ సభలో ప్రదీప్ సింఘా ఠాకూర్, పోటు రంగా రావు, సుబాష్ దేవ్, సంజయ్ సింఘ్వ, డీసీ గొహాన్, కేజీ రామచందర్, కె.రాము, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, గోకెనెపల్లి వెంకటేశ్వరరావు ముఖ్య వక్తలుగా ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా అరుణోదయ, ఇతర సాంస్కృతిక సంస్థలచే కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అదేవిధంగా 4, 5 తేదీల్లో భక్త రామదాసు కళాక్షేత్రం (కామ్రేడ్స్ డీవీకే, భాస్కర్ నంది, షర్మిష్టా, శివరాంల హాల్) లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ దివ్య, శ్రీనివాస్, బషీర్, సర్వర్ తదితరులు పాల్గొన్నా రు. ఈ మేరకు కరీంనగర్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఖమ్మంలో జరుగే మూడు విప్లవ రాజకీయ పార్టీల ఐక్యతా సభల విజయవంతానికి కార్మికులు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, అన్నిరంగాల ప్రజలు తమ నైతిక మద్దతును ప్రకటించి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

### స్కూల్ బస్ ఢీకొనడంతో మృతి

### అతివేగమే ప్రమాదానికి కారణంగా గుర్తింపు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** స్కూల్ బస్, బైకు ఎదురుగా ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మరిపెడ మండలం బురహానపురం గ్రామ శివారు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన బాధవత్ శంకర్ తానంచర్ల నుంచి బురహాన్ పురం వైపునకు వస్తున్నాడు. అదే సమయంలో మరిపెడలోని ఒక ప్రైవేటు స్కూలుకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకొని తానంచర్ల వైపునకు వెళ్లోంది. ఈ క్రమంలో బురహాన్ పురం శివారులో శంకర్ బైకు నేరుగా స్కూల్ బస్సుకు ఢీకొనడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయదారులకు జరిమానా, దుకాణాల సీజ్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పరిధిలోని పిన్నవారి వీధి, ఓల్డ్ బీట్ బజార్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న ఎనిమిది దుకాణాలపై బల్దియాకు చెందిన అధికారులు, సిబ్బంది శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకొని ప్లాస్టిక్ విక్రయిస్తున్న విక్రయదారులకు రూ. 1.03లక్షల పెనాల్టీ విధించడంతోపాటు ఆయా దుకాణాలను సీజ్ చేసి ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ నగరాన్ని ఇప్పటికే ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా ప్రకటించడం జరిగిందని, ఇట్టి నేపథ్యంలో బల్దియా వ్యాప్తంగా ఉన్న ప్లాస్టిక్ దుకాణదారులతో గతంలో సమావేశం ఏర్పాటు చేసి సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను విక్రయించవద్దని సూచించడం జరిగిందన్నారు. అయినప్పటికీ కొంతమంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో దాడులు నిర్వహించి దుకాణాలను సీజ్ చేశామన్నారు. భవిష్యత్తులో సింగిల్ యుజ్ ప్లాస్టిక్ ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్ వైజర్లు సాంబయ్య, నరేందర్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ రెడ్డి, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా

### శానిటేషన్ ఉన్నతాధికారులతో సమావేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని బల్దియా ఇంచార్జి కమిషనర్, వరంగల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్ విధానాలను ముఖ్య ఆరోగ్యాధికారి ఇంచార్జి కమిషనర్ కు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న పది రోజుల్లో సానిటేషన్ ను పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతిరోజు కనీసం రెండు వార్డుల్లో శానిటేషన్ క్షేత్ర స్థాయి పరిశీలనతో పాటు పన్నుల పురోగతి, నీటి సరఫరా తీరును కూడా పరిశీలిస్తానన్నారు. 10 రోజుల్లో కనీసం 30 డివిజన్ లలో పర్యటనలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మేడారం జాతరలో శానిటేషన్ నిర్వహణకు బల్దియా నుంచి పారిశుధ్య సిబ్బందిని పంపించడం జరుగుతుందన్నారు. 50 సంవత్సరాలు పై బడిన సిబ్బందికి మినహాయింపుతో పాటు ఆరోగ్య సంబంధ సమస్యలు ఉన్న సిబ్బందిని తీసుకు వెళ్లవద్దని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్వైజర్లు సాంబయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వదంతులు నమ్మొద్దు

### హనుమకొండ ఏసీపీ కిరణ్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిన్నపిల్లలను అపహరించే ముఠా నగరంలో ప్రవేశించిందని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మవద్దని హనుమకొండ ఏసీపీ వెల్లడించారు. ఈ మేరకు ఏసీపీ కమిషనర్ కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. పిల్లలను ఆపహరించేందుకు ఎలాంటి ముఠాలు నగరంలోకి రాలేదని, అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసు యంత్రాంగం పటిష్టమైన నిఘాతో బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం చేయటం సరికాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100, పోలీసు కంట్రోల్ రూమ్ 8712 685070 నెంబరుకు సమాచారం అందించాలన్నారు.